హైబీపీ..నో హ్యాపీ!

మారిన జీవనశైలి, వ్యాయామం లేని జీవనం, ఫాస్ట్, జంక్‌ఫుడ్స్, తీవ్రమైన మానసిక ఒత్తిడి కలగలిసి మనిషికి రక్తపోటు తెప్పిస్తున్నాయి. ఒకప్పుడు సమాజంలో వందలో ఒకరో ఇద్దరికో బీపీ ఉండేది. ఇప్పుడు పది మందిలో ఇద్దరిని ఈ రుగ్మత వేధిస్తోంది. బీపీతో పాటు దాని అనుబంధ వ్యాధులూ మనిషిని మరింత కృంగదీస్తున్నాయి. బీపీ ఎక్కువైనా, తక్కువైనా సరే చెట్టంత మనిషిని కుప్పకూల్చేస్తున్నాయి. ఈ నెల 17న అంతర్జాతీయ రక్తపోటు దినోత్సవం సందర్భంగా 'సాక్షి' పాఠకుల కోసం ప్రత్యేక కథనం.

- పెరుగుతున్న రక్తపోటు బాధితులు
- గ్రామీణ ప్రాంతాల్లో 25 శాతం
- పట్టణ ప్రాంతాల్లో 30 శాతం మంది బాధితులు
- నియంత్రణ లేని ఆహారం, స్థూలకాయం, మానసిక ఒత్తిళ్లే కారణం
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా మందులు
- నేడు అంతర్జాతీయ రక్తపోటు దినోత్సవం



కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో ప్రస్తుతం 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. వీటితో పాటు మరో 12 ఆరోగ్య కేంద్రాలు అదనంగా వస్తున్నాయి. వీటితో పాటు 28 అర్బన్‌హెల్త్ సెంటర్లు, 400 పైగా సచివాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో ఆశాలు, ఏఎన్‌ఎంలు కలిసి కొంత కాలంగా నాన్ కమ్యూనికబుల్ డిసీజ్(ఎన్‌సీడీ) సర్వే చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 24,73,883 మందికి పరీక్షలు నిర్వహించగా 6,68,746 మందికి రక్తపోటు ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. ఈ లెక్కన గ్రామీణ ప్రాంతాల్లో 25 శాతం, పట్టణ ప్రాంతాల్లో 30 శాతం మంది రక్తపోటుకు గురైనట్లు వైద్యులు పేర్కొంటున్నారు. ప్రజల్లో కుటుంబ, ఆర్థిక, సామాజిక ఆలోచనల కారణంగా విపరీతమైన మానసిక ఒత్తిడి పెరిగి ఆందోళన ఎక్కువ కావడం, పెరుగుతున్న స్థూలకాయం, వ్యాయామం లేకపోవడం, ఆహారపు అలవాట్ల కారణంగా ఇటు పట్టణాలతో పాటు గ్రామాల్లోనూ బీపీ బాధితుల సంఖ్య పెరుగుతుండటం ఆందోళన కలిపిస్తోంది. వీరికి ఆయా ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లోకి వచ్చే 104 వాహనాల వద్ద హైబీపీకి ఉచితంగా చికిత్స అందించడంతో పాటు అటెన్‌లాల్, ఆమ్లోడిపిన్, టెల్మిసార్టన్, నిపిడిపిన్, సిల్నిడిపిన్, మెటోప్రొలాల్, లొసార్టాన్ తదితర హైబీపీ మందులు ఉచితంగా ఇస్తున్నారు.

రక్తపోటు అంటే..

వ్యక్తి గుండె సాధారణ స్థితిలో బ్లడ్‌ప్రెషర్(బీపీ) 120/80గా పేర్కొంటారు. తాజాగా ప్రపంచ ఆరోగ్య సంస్థ పెద్ద వయస్సు వారికి కొన్ని పరిస్థితుల్లో 149/90గా ఉన్నా సాధారణ స్థితిగానే నిర్ధారిస్తున్నారు. బీపీ అసాధారణ రీతిలో 160/100, 170/110, 200/120గా ఉంటే ఆరోగ్య సమస్య ఉత్పన్నమవుతుంది. ఇలాంటి పరిస్థితిల్లో కొన్నిసార్లు గుండె, మెదడులో రక్తనాళాలు దెబ్బతినడం, చిట్లడం జరిగి స్ట్రోక్‌తో పక్షవాతానికి గురై ఆసుపత్రి పాలు కావాల్సి వస్తుంది. కొన్నిసార్లు మెదడులో రక్తం చిట్లి చికిత్సకు లొంగక ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుంది.

రక్తపోటు నియంత్రణ ఇలా..

- ప్రతి ఒక్కరూ రోజూ 30 నిమిషాల పాటు వాకింగ్(నడక) చేస్తే రక్తపోటును 5 నుంచి 8 పాయింట్ల వరకు తగ్గించుకోవచ్చు.
- జాగింగ్, సైక్లింగ్, డాన్స్ కూడా రక్తపోటును తగ్గిస్తాయి.
- యోగా, ప్రాణాయామాలు మేలు చేస్తాయి.
- ఈ వ్యాయామాలు వారి వయస్సు, ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వైద్యుల సలహా మేరకు చేయాలి.
- ఆహారంలో ఉప్పు తగ్గించుకోవడంతో పాటు ధూమ, మద్యపానాలు మానేయాలి. మితాహారం తీసుకోవడం, బరువు తగ్గడం తప్పనిసరి.

అధిక బీపీతో గుండెకు చేటు



గుండెపోటు, స్ట్రోక్ వంటి వాటికి రక్తపోటు ప్రధాన కారణం. బీపీ తీవ్రస్థాయికి చేరినప్పుడు విపరీతమైన తలనొప్పి, నిద్రలేమి, చూపు మసకబారడం, విపరీతమైన అలసట, చెవుల్లో రింగుమని శబ్దాలు రావడం, శ్వాసతీసుకోవడంలో ఇబ్బందులు, గుండెదడ, తికమక పడటం లక్షణాలు కనిపిస్తాయి. బీపీ ఉన్నవారు యేటా తప్పకుండా గుండె పరీక్షలు చేయించుకోవాలి.

– డాక్టర్ చైతన్యకుమార్, ఇంటర్వెన్షల్ కార్డియాలజిస్టు, కర్నూలు

రక్తపోటును నిర్లక్ష్యం చేస్తే కిడ్నీకి చేటు



అధిక రక్తపోటు కిడ్నీ వ్యాధికి కారణం అవుతుంది. అధిక రక్తపోటుతో పాటు కిడ్నీ వ్యాధిలోనూ కాళ్లు, ముఖం వాపు కనిపిస్తాయి. ఇక్కడే చాలా మంది పొరపాటుకు గురవుతారు. కావున ఈ లక్షణాలు కనిపిస్తే తప్పకుండా కిడ్నీ వ్యాధినిర్ధారణ పరీక్షలు చేయించాలి. రోజూ తగినంత నీటిని తాగడంతో పాటు తప్పనిసరిగా వ్యాయామం చేయాలి.

– డాక్టర్ శివశంకర్‌రెడ్డి, యురాలజిస్టు, కర్నూలు

క్లుప్తంగా

వాహనం అందజేత



వాహనాన్ని అందజేస్తున్న కలెక్టర్ డాక్టర్ సృజన

కర్నూలు(సెంట్రల్): ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకంలో భాగంగా గోనెగండ్ల మండలం పెద్దనెలటూరుకు చెందిన బెస్త జగదీష్‌బాబుకు వాహనం మంజూరైంది. ఆ వాహనాన్ని మంగళవారం కలెక్టరేట్ కాంప్లెక్స్‌లో కలెక్టర్ డాక్టర్ జి.సృజన లబ్ధిదారుడికి అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మత్స్య సంపదను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ జేడీ శ్యామల పాల్గొన్నారు.

హజ్ యాత్రికుల ఖాతాలకు నగదు జమ

కర్నూలు(రాజ్‌విహార్): ప్రభుత్వ ఆర్థిక సాయం నగదును హజ్ యాత్రికుల వ్యక్తిగత ఖాతాలకు మంగళవారం జమ చేసింది. హజ్ యాత్రకు వెళ్లే 274 మంది కర్నూలు జిల్లా వాసులకు, 121 మంది నంద్యాల వాసులకు రూ.80 వేల చొప్పున మొత్తం రూ.3.16 కోట్లు జమ చేశారు. హజ్ యాత్రకు వెళ్లక ముందే ప్రభుత్వం ఆర్థిక సాయాన్ని యాత్రికుల ఖాతాలోకి జమ చేయడంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు హాఫీజ్ మంజూర్ అహ్మద్ పేర్కొన్నారు.

రాష్ట్ర కార్యవర్గంలో లచ్చన్నకు చోటు



కర్నూలు(అర్బన్): ఏపీ పంచాయతీరాజ్ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గంలో లచ్చన్నకు లభించింది. ఈనెల 13న గుంటూరు జెడ్పీ సమావేశ మందిరంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ ఎంపికలో తనను రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎన్నుకున్నారని లచ్చన్న మంగళవారం స్థానిక విలేకరులకు తెలిపారు. జిల్లా అధ్యక్షునిగా కొనసాగుతున్న తనకు ఇప్పుడు మరింత బాధ్యతను మోపారన్నారు.

గ్రంథాలయ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలి

కర్నూలు కల్చరల్: గ్రంథాలయ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని, ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని కోరుతూ గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వజ్రాల గోవిందరెడ్డి, ఎస్.బాషా జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు.

బీజేపీ ప్రభుత్వంలో రైతులకు తీవ్ర అన్యాయం



మాట్లాడుతున్న పి.రామచంద్రయ్య

కర్నూలు(సెంట్రల్): కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.రామచంద్రయ్య ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం సీఆర్ భవన్‌లో జరిగిన ఏపీ రైతు సంఘం జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని మాయమాటలతో మోదీ అధికారంలోకి వచ్చి వ్యయాన్ని రెట్టింపు చేయడంతో 1.50 లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. రైతులను ఆదుకోవాలని ప్రధాన డిమాండ్‌తో ఈనెల 20న వ్యవసాయాధికారుల కార్యాలయాల ఎదుట ధర్నా చేయనున్నట్లు చెప్పారు. జూన్ 13, 14, 15 తేదీల్లో నరసరావుపేటలో జరిగే ఏపీ రైతు సంఘం రాష్ట్ర స్థాయి వర్క్ షాపును జయప్రదం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు కె.లక్ష్మీరెడ్డి, కె. జగన్నాథం పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌ను పరిశీలించిన జేసీ

కర్నూలు(రాజ్‌విహార్): కర్నూలు సిటీ రైల్వే స్టేషన్‌ను జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య మంగళవారం పరిశీలించారు. రైల్వే స్టేషన్ రెండో ద్వారం ఏర్పాటుకు స్థలం, ద్వార మార్గాన్ని మున్సిపల్ కమిషనర్ భార్గవతేజతో కలిసి ఆమె తనిఖీ చేశారు. అక్కడి వివరాలను రైల్వే అధికారులను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట రైల్వే స్టేషన్ మేనేజరు నాగేంద్ర, కమర్షియల్ అధికారి మున్నోజిరావు ఉన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్ : కస్టడీ , ఉగ్రం, విరుపాక్ష, ది కేరళ స్టోరీ, పొన్నియిన్ సెల్వన్–2, గార్డియన్స్ ఆఫ్ గెలాక్సీ–3
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : కస్టడీ, ఫర్హానా, ఉగ్రం, విరుపాక్ష, ది కేరళ స్టోరీ , రామబాణం
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : కస్టడీ, ఉగ్రం, విరుపాక్ష
ఐనాక్స్ : గార్డియన్స్ ఆఫ్ గెలాక్సీ–3, ఉగ్రం, ది కేరళ స్టోరీ, ఐబీ 71, ఛత్రపతి , ది స్టోరీ ఆఫ్ ఎ బ్యూటిఫుల్ గర్ల్
భరత్ కాంప్లెక్స్ : కథ వెనుక కథ, పొన్నియిన్ సెల్వన్–2, ది కేరళ స్టోరీ, శ్రీరామ,రామబాణం
రాజ్ : కస్టడీ
విజయ: ది కేరళ స్టోరీ

ఉర్దూ మీడియం విద్యార్థులకు ఉచిత శిక్షణ

కర్నూలు సిటీ: డైట్ సెట్‌కు సన్నద్ధం అయ్యే ఉర్దూ మీడియం విద్యార్థులకు స్థానిక ఉస్మానియా డిగ్రీ కాలేజీలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు రీజినల్ సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనార్టీస్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ సయ్యద్ సమీవుద్దీన్ ముజమ్మిల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బోధనలో అనుభవజ్ఞులైన అధ్యాపకుల చేత శిక్షణ ఇప్పించనున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9849896996, 8074421688 సంప్రదించవచ్చన్నారు.

ఎండల్లో పని చేయించొద్దు

కర్నూలు(రాజ్‌విహార్): ఎండ, వేడి తీవ్రంగా ఉన్నందున కార్మికుల పని వేళల్లో మార్పులు చేయాలని కార్మిక శాఖ డిప్యూటీ కమిషన్ కె.వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పని ప్రదేశాల్లో తాగునీరు, ఓఆర్‌ఎస్, మజ్జిగ, కూలింగ్ సెల్లార్లు వంటివి సమకూర్చాల్సిన బాధ్యత యజమానులు, కాంట్రాక్టు ఏజెన్సీలపై ఉందన్నారు. అన్ని రంగాల కార్మికులను ఉదయం 11:30 నుంచి సాయంత్రం 4:30 గంటల మధ్య బహిరంగ ప్రదేశాల్లో పనులు చేయించరాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలను విస్మరిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

రేపు టీడీపీ విస్తృత స్థాయి సమావేశం

కర్నూలు: తెలుగుదేశం పార్టీ కర్నూలు జిల్లా విస్తృత స్థాయి సమావేశం ఈనెల 18న స్థానిక మౌర్యా ఇన్ హోటల్‌లో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ కర్నూలు పార్లమెంట్ అధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు శత జయంతి వేడుకలకు సంబంధించి సమావేశంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కాల్వ శ్రీనివాసులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు



ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డి

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: నవరత్నాల పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం కల్లూరు అర్బన్ 20వ వార్డు 52వ సచివాలయ పరిధిలోని కమలానగర్, సిండికేట్ బ్యాంక్ కాలనీ, మహవీర్ కాలనీ, టెలికాం నగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. నాలుగేళ్లలో ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరించి సంక్షేమ క్యాలెండర్‌ను అందించారు. ఆరోగ్యశ్రీలో థైరాయిడ్ ఆపరేషన్ చేయించుకోవడానికి ప్రభుత్వం రూ.30 వేలు ఇచ్చిందని మహవీర్ కాలనీకి చెందిన రాజశేఖర్, గుండె ఆపరేషన్‌కు రూ.1.48 లక్షలు ఇచ్చిందని సుజాత.. ఎమ్మెల్యేకు తెలిపారు. కాగా పార్కును అభివృద్ధి చేసి లైట్లు వేయాలని టెలికాం నగర్ వాసులు కోరగా స్పందించిన కాటసాని.. సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు లక్ష్మిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, అరుణ, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, వార్డుల జేసీఎస్ ఇన్‌చార్జ్ హనుమంతురెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో సాధన చేస్తే పతకాలు సొంతం

కర్నూలు(టౌన్): క్రీడాకారులు ఏకాగ్రతతో విలువిద్యలో సాధన చేస్తే పతకాలు సాధించడం సులభమని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఏర్పాటు చేసిన సమ్మర్ ఆర్చరీ క్యాంప్‌ను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులు తమకు నచ్చిన క్రీడాంశంలో శిక్షణ పొందాలన్నారు. ఎంతో ఆదరణ ఉన్న విలువిద్య క్రీడను నేర్చుకుంటున్న చిన్నారులను అభినందిస్తున్నానన్నారు. తన వంతుగా ఈ క్రీడకు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో విలువిద్య సంఘం జిల్లా కార్యదర్శి నాగరత్నమయ్య, కోచ్ వంశీక్రిష్ణ పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

కర్నూలు: ఆసుపత్రుల్లో అగ్నిప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, రోగులను ఎలా రక్షించాలి అనే అంశంపై నగర పరిధిలోని ప్రైవేట్ ఆసుపత్రుల సిబ్బందికి సి.క్యాంప్ సెంటర్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో మంగళవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ ప్రాంతీయ అధికారి భూపాల్‌రెడ్డి, డీఎఫ్‌ఓలు అవినాష్, జయసింహ, బాలరాజు, ఏడీఎఫ్‌ఓ చిన్నబజారి పాల్గొన్నారు.

రెగ్యులర్ డీటీడబ్ల్యూఓను నియమించండి

కర్నూలు(అర్బన్): జిల్లా గిరిజన సంక్షేమ శాఖకు రెగ్యులర్ అధికారిని నియమించాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు వై.రాజు, మాల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.వెంకటేష్ మంగళవారం విజయవాడలో ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్ వెంకటమురళిని కలిసి వినతి పత్రం అందించారు.

ఆంజనేయస్వామి స్థలాలను ఖాళీ చేయించాలి

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీలోని కోట ఆంజనేయ స్వామి ఆలయ స్థలాన్ని ఆక్రమించుకుని నివసిస్తున్న కుటుంబాల వారు బేషరతుగా ఖాళీ చేయాలని బజరంగ్‌దల్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు గోరంట్ల రమణ డిమాండ్ చేశారు. మంగళవారం వినాయక్ ఘాట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దేవదాయ, రెవెన్యూ శాఖల, న్యాయం స్థానం ఆదేశాలు జారీ చేసినా ఆక్రమణదారులు స్థలాన్ని ఖాళీ చేయడం లేదన్నారు. ఇప్పటికైనా ఖాళీ చేయకపోతే ధార్మిక సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో వీహెచ్‌పీ, బీజేపీ, బజరంగ్ దళ్ నాయకులు మాలతి, సండడి సుధాకర్, మద్దిలేటి, భానుప్రకాష్, గోవిందరాజులు, నాగరాజు, భగీరథ, ప్రకాష్ సింగ్ పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌దే



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

- ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. మంగళవారం ఆయన రెండో వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. షాదాన్ స్కూల్ వీధి, మార్వాడి వీధి తదిరత ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి ప్రజలను పలకరించారు. ప్రభుత్వం నాలుగేళ్లలో మంజూరు చేసిన పథకాల సంక్షేమ క్యాలెండర్‌ను అందించారు. ఈ సందర్భంగా ప్రజలు చెప్పుకునే సమస్యలు విని వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను ఫోన్ ద్వారా ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలను 98 శాతం నెరవేర్చి జగనన్న చరిత్ర సృష్టించారన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న పథకాలను ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్నాయన్నారు. వర్గాలు, పార్టీలను చూడకుండా పథకాలు అమలు చేస్తుండడంతో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో స్థానిక వార్డు ఇన్‌చార్జ్ ఫిరోజ్, నాయకులు చాంద్ బాషా, అనురాధ, రవి ప్రకాష్, హుసేన్, వెంకట్, యూసుఫ్, ఇక్బాల్ వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగుల డిమాండ్‌లు పరిష్కరించాలి

కర్నూలు(అగ్రికల్చర్): ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు, పెన్షనర్ల న్యాయమైన డిమాండ్‌లను ప్రభుత్వం పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) జిల్లా అధ్యక్షుడు బంగి శ్రీధర్ కోరారు. మంగళవారం జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిమాండ్‌లను సాధించుకోవడానికి ఈ నెల 26 నుంచి చేపట్టనున్న నిరసన కార్యక్రమాల్లో అన్ని శాఖల ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. 26న కర్నూలు, 29న ఆలూరు, 30న ఎమ్మిగనూరు, 31న పత్తికొండ, జూన్ 1న ఆదోని, 2న కోడుమూరులో రిలే దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు.

విధులకు డుమ్మా కొడితే చర్యలు తప్పవు

కర్నూలు (టౌన్): విధులకు డుమ్మా కొడితే చర్యలు తప్పవని నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ హెచ్చరించారు. మంగళవారం ఉద్యోగుల హాజరు శాతం పరిశీలించారు. నగరపాలక మేనేజర్ చిన్నరాముడు వద్ద రిజిష్టర్‌లో సంతకాలు తనిఖీ చేశారు. పలువురు ఉద్యోగులు విధులకు సకాలంలో రావడం లేదన్న ఫిర్యాదుల మేరకు అడిషనల్ కమిషనర్ తనిఖీలు నిర్వహించారు. పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉద్యోగ మేళాకు విశేష స్పందన



మేళాలో మాట్లాడుతున్న కర్నూలు మేయర్ బీవై రామయ్య

కర్నూలు సిటీ: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీలో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. నగరపాలక సంస్థ మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే ఎంఏ హాఫీజ్‌ఖాన్ హాజరై ప్రసంగించారు. ఇలాంటి అవకాశాలను నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డీఆర్‌డీఏ పీడీ వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ మేళాలో వివిధ కంపెనీల ప్రతినిధులు హాజరై 232 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరాశాంతి, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా ఉపాధి, కల్పన అధికారి సోమా శివారెడ్డి, సీడ్‌అప్ జిల్లా మేనేజర్ కిరణ్ పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే డెంగీ నివారణ



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): ప్రజల అప్రమత్తతతోనే డెంగీ వ్యాధిని నివారించవచ్చని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య అన్నారు. మలేరియా విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం నగరంలోని విశ్వభారతి నర్సింగ్ కాలేజీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ ఎల్. భాస్కర్ మాట్లాడుతూ డెంగీ నివారణకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. జిల్లా మలేరియా అధికారి నూకరాజు మాట్లాడుతూ దోమల ద్వారా మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, మెదడువాపు, ఫైలేరియా వ్యాధులు వస్తాయన్నారు. కార్యక్రమంలో డీపీఎంఓ డాక్టర్ ఉమ, డెమో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాసెసింగ్ యూనిట్ల తనిఖీ



ప్రాసెసింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి, ఏడీఏ సాలురెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): సబ్సిడీపై పంపిణీ చేసే వేరుశనగను ప్రాసెసింగ్ చేస్తున్న ప్రాసెసింగ్ యూనిట్లను జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి తనిఖీ చేశారు. మంగళవారం కల్లూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని శివసాయి సీడ్స్, శ్రీకృష్ణ సీడ్స్ ప్రాసెసింగ్ యూనిట్లలో వేరుశనగ ప్రాసెసింగ్ ప్రక్రియను పరిశీలించారు. 100 శాతం నాణ్యతతో ఉండాలని ప్రాసెసింగ్ యూనిట్ల నిర్వాహకులు, ఏపీసీడ్స్ అధికారులను ఆదేశించారు. ప్రాసెసింగ్ అయిన వేరుశనగను ఆర్‌బీకేలలో రైతులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఇప్పటి వరకు ఆర్‌బీకేలకు 600 క్వింటాళ్ల వేరుశనగను తరలించినట్లు ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ శ్రీనివాసరావు జిల్లా వ్యవసాయ అధికారికి వివరించారు. కర్నూలు పరిసరాల్లో 6 ప్రాసెసింగ్ యూనిట్లు ఉన్నాయని, అన్నింటిలోనూ పూర్తి నాణ్యతతో వేరుశనగ విత్తనం కాయలు సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. తనిఖీల్లో కర్నూలు ఏడీఏ సాలురెడ్డి, కర్నూలు, కల్లూరు ఏఓలు విశ్వనాథ్, శ్రీనివాసరెడ్డి,సాంకేతిక ఏఓ రాఘవేంద్ర పాల్గొన్నారు.

నాగేంద్రనగర్‌లో చోరీ

కర్నూలు: నాల్గవ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాగేంద్రనగర్‌లో నివాసముంటున్న ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయుడు రమణ ఇంట్లో చోరీ జరిగింది. ఈయన ఈనెల 13న ఇంటికి తాళం వేసి మానవపాడుకు వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన దొంగలు తాళాలు పగులగొట్టి పడక గదిలోకి వెళ్లి బీరువాను బద్దలుకొట్టి అందులో ఉన్న 9 తులాల బంగారు, వెండి ఆభరణాలను మూటగట్టుకుని ఉడాయించారు. సోమవారం సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చేసరికి తలుపులు తెరిచి ఉండటం, బీరువాలోని సామగ్రి చిందరవందరగా పడివుండటం చూసి చోరీ జరిగిందని నిర్ధారించుకుని నాల్గ వ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దొంగల కోసం గాలిస్తున్నారు.

త్రైమాసిక పన్ను రద్దు చేయాలి

కర్నూలు(సెంట్రల్): వాహనాలపై పెంచిన త్రైమాసిక పన్నును తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ,ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఏకంగా 25 శాతం పన్ను పెంచుతూ జీఓ విడుదల చేయడం అన్యాయమన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా పన్ను పెంచడంతో వాహనాల యజమానులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు.